క్లుప్తంగా

విజయ గణపతికి ప్రత్యేక పూజలు



విజయగణపతికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రమైన రామనారాయణంలో కొలువై ఉన్న విజయగణపతికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. హస్తా నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవాలయం అర్చకులు చాణక్య, శ్రీహర్ష ఆధ్వర్యంలో విజయగణపతికి స్నపనం, పంచామృతాభిషేకాలు చేపట్టారు. కార్యక్రమంలో ఎన్‌సీఎస్ ట్రస్ట్ సభ్యులు నారాయణం శ్రీనివాస్, నీరజ వల్లి దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి ఘనంగా నివాళులు



రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డీసీసీ అధ్యక్షుడు రమేష్‌కుమార్, తదితరులు

డెంకాడ: దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 79వ జయంతిని మండలంలోని పెదతాడివాడలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పెదతాడివాడ జంక్షన్ వద్దనున్న రాజీవ్‌గాంధీ విగ్రహానికి డీసీసీ అధ్యక్షుడు సరగడ రమేష్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సూరిబాబు, శ్రీను రాజు, రవి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

24న చలో విజయవాడ



సీఐటీయూ నాయకుల ప్రచారం

విజయనగరం ఫూల్‌బాగ్: మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ ఈనెల 24న చలో విజయవాడ కార్యక్రమం చేపట్టనున్నట్లు సీఐటీయూ నాయకుడు ఎ. జగన్‌మోహన్‌రావు తెలిపారు. ఈ మేరకు స్థానిక కొత్తపేట, బుంగవీధి, స్టేడియం పేటలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కుమారి, పైడిరాజు, కృష్ణ,వంశీ, తదితరులు పాల్గొన్నారు.


దుర్గమ్మకు ప్రతి శుక్రవారం క్షీరాభిషేకం



క్షీరాభిషేకం అందుకోనున్న దుర్గమ్మ విగ్రహం

శృంగవరపుకోట: స్థానిక దేవీ జంక్షన్‌లో ఉన్న దుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి ఇకపై క్షీరాభిషేకాలు జరగనున్నాయి. ఆలయం ప్రారంభం నుంచి అమ్మవారికి శరన్నవరాత్రులు, తదితర ప్రత్యేక సమయాల్లో కుంకుమ పూజలు మినహా అభిషేకాలు చేయలేదు. ఇటీవల దేవాలయ కమిటీ నిర్వాహకులు ఇకపై ప్రతీ శుక్రవారం అమ్మవారికి క్షీరాభిషేకం చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. దీంతో ఆదివారం ఆలయంలో అమ్మవారి పంచలోహ విగ్రహాన్ని శాస్త్రోక్తంగా పూజాధికాలు చేసి ఏర్పాటు చేశారు.

ఆర్థిక సాయం



బాధితుడికి నగదు అందజేస్తున్న జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు

చీపురుపల్లిరూరల్: మండలంలోని గచ్చలవలస గ్రామానికి చెందిన రొంగలి రాము క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. వైద్యఖర్చుల నిమిత్తం నియోజకవర్గ జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు బాధితుడి ఇంటికి ఆదివారం వెళ్లి రూ.15 వేల ఆర్థిక సహాయం చేశారు. నియోజకవర్గ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షుడు ఎం .లక్ష్మణరావు మాట్లాడుతూ బాధితుడు రాముది పేదకుటుంబం కావడంతో తమ వంతు సహాయం చేశామని, ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు దాతలు ముందుకురావాలని కోరారు. నాగులపల్లి నారాయణరావు,రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు ప్రజాధరణ పెరిగింది



పడాలపేట సర్పంచ్‌గా ఎన్నికైన సువ్వాడ శ్రీదేవి, కొండకరకాం వార్డు మెంబర్ తుమ్మగంటి మంగలను అభినందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- ఉప ఎన్నికల్లో గెలిచిన స్థానాల్లో గతం కంటే ఎక్కువ మెజార్టీ
- గెలిపించిన ఓటర్లకు ధన్యవాదాలు
- ఈ నెల 25న సీఎం చేతుల మీదుగా గిరిజన వర్సిటీకి శంకుస్థాపన
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి

విజయనగరం: రాష్ట్రంలో ప్రజారంజక పాలన సాగిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజాదరణ మరింతగా పెరిగిందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వం కావాలని అంతా కోరుకుంటున్నారన్న విషయం పంచాయతీ ఉప ఎన్నికల ద్వారా రుజువైందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. విజయనగరంలోని తన నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పడాలపేట సర్పంచ్‌గా గెలిచిన సువ్వాడ శ్రీదేవి, కొండకరకాం వార్డు సభ్యురాలు తుమ్మగంటి మంగలను సత్కరించారు. తమపై నమ్మకం ఉంచి ఓటేసి గెలిపించిన ప్రజలకు, నాయకులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల మాట్లాడుతూ, పంచాయతీ ఉప ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ బలపర్చిన అభ్యర్థులు సంపూర్ణ ఆధిక్యం సాధించారన్నారు. జిల్లాతో పాటు విజయనగరం నియోజకవర్గంలోనూ పూర్తి స్థాయిలో విజయం సాధించామన్నారు. గెలిచిన స్థానాల్లో గతం కన్నా మెజార్టీ ఓట్లు సాధించామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పాలన, స్థానిక నాయకులు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల వల్లే ప్రజలు ఆదరించారన్నారు. ప్రజలకు ఏ ఇబ్బంది కలిగినా, ఎటువంటి అవసరం వచ్చినా వైఎస్సార్‌సీపీ నాయకులు అండగా ఉంటారన్న ధైర్యం కలిగించామన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని ప్రజాధరణ రోజురోజుకూ పెరుగుతుండడంతో ప్రతిపక్షాలకు దిక్కుతోచడం లేదన్నారు. గతంలో ప్రజలకు తీవ్ర అన్యాయం చేసిన టీడీపీకి రానున్న ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు లేదన్నారు. 2024లో జరిగే ఎన్నికలే టీడీపీకి ఆఖరు ఎన్నికలవుతాయని తెలిపారు.

25న ముఖ్యమంత్రి రాక

మంత్రి బొత్స సత్యనారాయణ సూచనలతో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, శాసనసభ్యులమంతా కలిసి జిల్లా అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్నామని కోలగట్ల తెలిపారు. ఈ నెల 25న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి జిల్లాకు రానున్నారని, అదే రోజు మెంటాడలో గిరిజన యూనివర్సిటీకి శంకుస్థాపన చేస్తారన్నారు. నాడు - నేడుతో విద్యాలయాలను అభివృద్ధి చేసిన ప్రభుత్వం, రాష్ట్రంలో 17 వైద్య కళాశాలల ఏర్పాటు చేసిందన్నారు. ఐదు కళాశాలల్లో ఈ ఏడాది నుంచే తరగతులు ప్రారంభమవుతాయని చెప్పారు. విజయనగరం జిల్లాకు వైద్య కళాశాల మంజూరు కావడం వల్ల ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్‌పర్సన్ శోభార్గవి, పీఏసీఎస్ అధ్యక్షుడు కెల్ల శ్రీనివాసరావు, మండల నాయకులు, వివిధ పంచాయతీల సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

హామీలు అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీదే...



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్‌లు, స్థానిక కార్పొరేటర్

- వైఎస్సార్‌సీపీ నాయకులు

విజయనగరం: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్‌లు అన్నారు. నగరంలోని 42వ డివిజన్ 50వ సచివాలయ పరిధిలో అయ్యన్నపేట కూడలి నుంచి ఆదివారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జ్‌లు కోలగట్ల తమ్మన్నశెట్టి, డాక్టర్ వీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు వివరించారు. నాలుగేళ్ల కాలంలో ఒక్కో ఇంటికి కలిగిన లబ్ధిని వివరిస్తూ ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అమ్మఒడి, ఆసరా, చేయూత, ఇళ్ల పట్టాలు, వాహనమిత్ర వంటి అనేక పథకాలతో ప్రజలంతా ఆనందంగా ఉన్నారని చెప్పారు. గడప గడపకు.. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. స్థానిక కార్పొరేటర్ పిన్నింటి కళావతి మాట్లాడుతూ, ఎన్నికలలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి శతశాతం అమలు చేశారన్నారు. గత ఎన్నికల్లో చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం వల్లే 2019లో ప్రజలు వైఎస్సార్‌సీపీని గెలిపించారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో కూడా మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ డివిజన్ నాయకులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

దోమలతోనే వ్యాధులు



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

విజయనగరం రూరల్: దోమలే అనేక వ్యాధులకు కారణమని, వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని రాకోడు పీహెచ్‌సీ వైద్యాధికారి మోపాడ జగదీష్ అన్నారు. అంతర్జాతీయ దోమల నివారణ దినం సందర్భంగా రాకోడు పీహెచ్‌సీ సిబ్బంది ఆదివారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు జగదీష్, శ్రావణి దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ప్రజలు ఇంటి పరిసరాలతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటిస్తేనే దోమలను వృద్ధి చెందకుండా అడ్డుకోగలమన్నారు. దోమలతో డెంగీ, మలేరియా, ఫైలేరియా, చికెన్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మాణిక్యం, పీహెచ్‌ఎన్ మాణిక్యం, పీహెచ్‌సీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బస్సు బోల్తాపై ఆరా..

నెల్లిమర్ల రూరల్: అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఘాట్ రోడ్డులో ఆర్టీసీ బస్సు బోల్తా పడిన ప్రమాదంపై ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మండలంలోని కొండవెలగాడలో ఆదివారం ఆమె మాట్లాడుతూ, ప్రమాదం ఎలా జరిగిందో ఆరా తీసినట్లు చెప్పారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. అక్కడి ఆర్టీసీ అధికారులతో మాట్లాడి క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. క్షతగాత్రులను, మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు సోమవారం వెళ్తున్నట్లు చెప్పారు.

వైఎస్సార్‌సీపీ మద్దతుతో అప్పల సత్యవతి గెలుపు



తోరోతు అప్పలసత్యవతి

డెంకాడ: మండలంలోని డి.తాళ్లవలస పంచాయతీలోని 7వ వార్డు మెంబర్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి తోరుతు అప్పలసత్యవతి గెలుపొందారు. ఈ ఎన్నికలో 123 ఓట్లు పోలవ్వగా అప్పలసత్యవతికి 105 ఓట్లు .. టీడీపీ మద్దతు అభ్యర్థికి 17 ఓట్లు వచ్చాయి. ఒక ఓటు చెల్లుబాటు కాలేదు. దీంతో ఎన్నికల అధికారి శర్మ తోరోతు అప్పలసత్యవతి గెలుపొందినట్టు ధ్రువీకరణపత్రం అందజేశారు.

అందుబాటులో ఎరువులు

దత్తిరాజేరు: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఖరీఫ్ సీజన్‌కు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఏఓ అనురాధ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.రైతులు తమపరిధిలోని వీఏఏలను కలిసి ఆధార్ కార్డు జిరాక్స్ అందజేసి యూరియా, డీఏపీ ఎరువులను తీసుకోవచ్చని పేర్కొన్నారు. అధిక మోతాదులో ఎరువులను వినియోగించకుండా వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని సూచించారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

రామభద్రపురం: మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు అవుతాయని, విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ తిరుమలరావు సూచించారు. ఆదివారం స్థానిక పోలీస్ చెక్‌పోస్టును సందర్శించిన ఆయన రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మత్తు పదార్థాలు తీసుకుని, వాహనాలు నడపడం వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. గంజాయి, కొకైన్, హెరాయిన్ వంటి మత్తు పదార్థాలతో పాటు మద్యానికి యువత బానిసలవుతున్నారని, ఇదే కొనసాగితే యువత జీవితం అంధకారంలో పడిపోతుందన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. ఎక్కడైన అపరిచిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

వెంకటరావు మృతి తీరనిలోటు



మొయిదలో శీర వెంకటరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, తదితరులు

- ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు

నెల్లిమర్ల రూరల్: జూట్‌మిల్లు కార్మిక సంఘ నాయకుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు శీర వెంకటరావు మృతి అటు పార్టీకి ఇటు కుటుంబానికి తీరని లోటని ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. మండలంలోని మొయిద గ్రామంలో ఆదివారం సంతాపసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ సురేష్‌బాబు హాజరై వెంకటరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కార్మిక సంఘ నాయకుడిగా వెంకటరావు కార్మికుల అభ్యున్నతికి నిరంతరం పోరాడరన్నారు. పార్టీ కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొని ఎనలేని సేవలు అందించారని గుర్తు చేశారు. మంచి వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమన్నారు. అనంతరం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఇజ్జిరోతు రాంబాబు కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

శ్రామిక మహిళల సమస్యలు పట్టవా..?



సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకురాలు మణి

విజయనగరం ఫూల్‌బాగ్: శ్రామిక మహిళల సమస్యలు ఈ ప్రభుత్వాలకు పట్టవా అని శ్రామిక మహిళా రాష్ట్ర నాయకురాలు పి. మణి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించారు. ఆదివారం స్థానిక కేఎల్ పురంలోని శ్రామిక భవనంలో జిల్లా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బీజేపీ ప్రభుత్వం మహిళలను హింసకు గురిచేసే విధానాలను అవలంభిస్తోందన్నారు. నేటికీ మహిళలు పనిచేస్తున్న చోట రక్షణ లేదన్నారు. లైంగిక వేధింపుల కమిటీలను ఎక్కడా వేయడం లేదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్, జిల్లా నాయకులు పి. లక్ష్మి, బి. సుధారాణి, ఎస్. అనసూయ, డి. రామలక్ష్మి, కృష్ణవేణి, బి. పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఉదారత



దాతలు అందజేసిన సీలింగ్‌ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్‌సెట్లు

విజయనగరం ఫూల్‌బాగ్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం కొప్పెర్ల (పూసపాటిరేగ)లో 1994 నుంచి 2002 వరకు చదువుకున్న విద్యార్థులు 28 సీలింగ్‌ఫ్యాన్లు, 50 ట్యూబ్‌లైట్లు సెట్లను ఆ పాఠశాలకు ఆదివారం అందజేశారు. పూర్వ విద్యార్థులను సమీకరించిన సోషల్ పీజీటీ సీతారామ్, మ్యాథ్స్ పీజీటీ కరుణాకరరావులను గురుకులాల జిల్లా సమన్వయకర్త టి పద్మజ అభినందించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబ సంతోషమే ప్రభుత్వ లక్ష్యం



మహిళా లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: రాష్ట్రంలో ప్రతీ కుంటుంబం సంతోషమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లక్ష్యమని, పేదల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే ధ్యేయంగా సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షే మ పథకాలు అమలు చేయడంతో పాటు గ్రామాల్లో మౌలికసదుపాయాలు మెరుగుపరుస్తున్నారని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని దెందేరు గ్రామంలో ఆదివారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించి, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రజలను ఆరా తీశారు. గ్రామస్తులు కొందరు ఆయన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సచివాలయ సిబ్బందితో నమోదు చేయించి త్వరలో పరిష్కరించాలని వారిని ఆదేశించారు. గ్రామంలో రూ.27 లక్షలతో ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు పనులను త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు.అలాగే రూ .25 లక్షలతో కల్యాణ మండపం నిర్మిస్తున్నామని చెప్పారు. నియోజకవర్గం పరిధిలో ఇప్పటి వరకు 249 రోజుల పాటు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించి, 64 వేల కుటుంబాలను కలిసి వారి సమస్యలను తెలుసుకుని వాటిలో 90 శాతంకు పైగా పరిష్కరించామని వివరించారు. గతంలో ఏ ఎమ్మెల్యే కూడా నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల కష్టసుఖాలు తెలుసుకున్న దాఖలాలు దేశ చరిత్రలో లేదని, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు మాత్రమే గడప గడపకూ వెళుతున్నారని స్పష్టం చేశారు. గతంలో ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి నాయకులు చుట్టూ తిరిగేవారని, ప్రస్తుతం జగనన్న పాలనలో నాయకులే ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తున్నారని అన్నారు. ఇలాంటి ప్రభుత్వాన్ని పదికాలాల పాటు నిలుపుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు గౌరపల్లి శివ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, మండల జేసీఎస్ ఇన్‌చార్జి బొంతల వెంకటరావు, దెందేరు, గులివిందాడ సర్పంచ్‌లు విరోతి వెంకటరమణ, జామి ఈశ్వరరావు, ఎంపీటీసీ వెలగల రమణ, పార్టీ నాయకులు మేలాస్త్రి అప్పారావు,పల్లా భీష్మ, పి.ఎస్.ఎన్.పాత్రుడు, బి.ఎ.నాయుడు, గొర్లె శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

రూ.35 లక్షలతో గొడౌన్ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న నాయకులు

గుర్ల: మండలంలోని గూడెం పీఏసీఎస్ పరిధిలో రూ.35 లక్షలతో గొడౌన్ నిర్మాణానికి పీఏసీఎస్ అధ్యక్షుడు రెడ్డి మురళీధరరావు ఆధ్వర్యంలో జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు ఆదివారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గూడెం పీఏసీఎస్ ప్రగతిపథంలో దూసుకుపోతోందని, పీఏసీఎస్ ఏ-గ్రేడ్‌కు చేరుకోవడంతో సొసైటీ పరిధిలో సీఎస్‌సీ కేంద్రం, హెచ్‌పీ గ్యాస్ సరఫరా కేంద్రాలు మంజూరయ్యాయన్నారు. గూడెం సర్పంచ్ ఎజ్జిపరుపు లక్ష్మణరావు, పీఏసీఎస్ డైరెక్టర్‌లు రఘుమండ సూర్యారావు, మీసాల సూరినాయుడు, నాయకులు తోట తిరుపతిరావు, రెడ్డి అప్పలనర్సయ్య, అట్టాడ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విద్యార్థులకు మేలు



బాడంగి: పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

తెర్లాం: పుస్తక పఠనంతోనే విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని, ప్రతీ విద్యార్థి ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మా కిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ పుస్తక పఠనం చేయడం ద్వారా మంచి విజ్ఞానం కలుగుతుందని, మంచి స్నేహితుడి కంటే పుస్తకం ఎంతో విలువైనదన్నారు.

బాడంగి: స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించి, గ్రంథాలయానికి వచ్చిన విద్యార్థులతో లైబ్రేరియన్ ఆర్.దుర్గాప్రసాద్ వారికి నచ్చిన పుస్తకాన్ని వారితో చదివించారు. అనంతరం కంప్యూటర్ బేసిక్స్‌ను నేర్పించారు. గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని, మంచి జ్ఞానవంతులుగా పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

విజయనగరం

9951602843

Office mail : vzmadvt@gmail.com